



సునామీ హెచ్చరికల కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో జ్యోతి వెలిగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్, పక్కన కేంద్ర మంత్రి కపిల్ సిబాల్ ★ సునామీ సూచనలను కంప్యూటర్ల ద్వారా పర్యవేక్షిస్తున్న సిబ్బంది

# 13 నిమిషాలు చాలు

## సునామీ వస్తుందో.. లేదో చెప్పొచ్చు

## తొలి హెచ్చరిక కేంద్రం హైదరాబాద్‌లో ప్రారంభం

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** దేశంలోని మొట్టమొదటి సునామీ హెచ్చరికల కేంద్రాన్ని సోమవారమిక్కడ కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి కపిల్ సిబాల్ ప్రారంభించారు. ప్రపంచంలోని మిగిలిన వాటితో పోలిస్తే ఈ కేంద్రం అత్యాధునికమైనదని చెప్పారు. సముద్ర గర్భంలో ఎక్కడ భూకంపం సంభవించినా దాని తీవ్రతను అంచనా వేసి 13 నిమిషాల్లో సునామీ వస్తుందా? రాదా? అన్న విషయాన్ని ప్రజలకు చేరవేస్తుందన్నారు. "భవిష్యత్తులో మరోసారి తీర ప్రాంతాల ప్రజలు ప్రకృతి ప్రళయానికి బలికాకుండా నివారించాలనే కృత నిశ్చయంతో ఏర్పాటు చేసిన ఈ సునామీ హెచ్చరికల కేంద్రాన్ని జాతికి అంకితం చేస్తున్నాను" అని ప్రకటించారు. సునామీ హెచ్చరికల కేంద్రం ఏర్పాటు కోసం హైదరాబాద్‌లో భారత జాతీయ మహాసముద్ర సమాచార కేంద్రం(ఇన్కోయిస్) ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో సముద్రంలోని పలు అంశాలపై పరిశోధనలు విస్తృతంగా జరుగుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనేమన్నారంటే.. "2004 డిసెంబరు 26న కొత్త సంవత్సర వేడుకలు జరుపుకోవడానికి సిద్ధమవుతున్న ప్రజలపై సముద్రుడు ఒక్కసారిగా ఉప్పొంగి పెద్ద ప్రళయాన్ని సృష్టించాడు. అది నా మనసును ఎంతగానో కలచి వేసింది. మరోసారి వేలాది మంది ప్రాణాలు ఇలా తుడిచి పెట్టుకుపోకూడదనే ఉద్దేశంతోనే అప్పటి సముద్రయాన శాఖ కార్యదర్శిగా ఉన్న హర్ష గుప్తాతో చర్చించాను. దాని ఫలితమే ఈ కేంద్రం" అన్నారు. ఇన్కోయిస్‌ను మరింతగా అభివృద్ధి చేయడానికి కొత్త కేంద్రాల ఏర్పాటుకు స్థలం అవసరమని చెప్పగానే ముఖ్యమంత్రి వైఎస్ 10 ఎకరాలు ఇవ్వడానికి అంగీకరించడం అభినందనీయమని సిబాల్ చెప్పారు. సునామీ హెచ్చరికల కేంద్రాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి కావలసిన అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని ఈ సందర్భంగా వైఎస్ హామీ ఇచ్చారు.